ప్రజాశక్తి
సోమవారం 12 ఆగస్టు 2024 | 5 | అనంతపురం



## రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో జీవించాలి

### ఎస్పీ కెవి.మురళీకృష్ణ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లాలోని రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలుగుతూ ప్రశాంతంగా జీవనం సాగించాలని ఎస్పీ కెవి.మురళీకృష్ణ సూచించారు. ఎస్పీ ఆదేశాలతో ఆదివారం వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలోని కఠోర హత్యలు, హీనమైన నేరాలకు పాల్పడి 'ఎ' కేటగిరీలో ఉన్న రౌడీషీటర్లను ఆయా పోలీసుస్టేషన్లకు పిలిపించి సి.ఐలు, ఎస్ఐలు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇందులో భాగంగా వీరి గత నేర చరిత్ర, ప్రస్తుత జీవన విధానం, స్థితిగతులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు ఏ చెడు పని చేసినా పోలీసులకు తెలిసిపోతుందనే విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. పాత పంథా మళ్లీ పునరావృతమైతే చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రౌడీషీటర్ కదలికలపై లోతుగా నిఘా వేశామని, హద్దు దాటి అల్లర్లు, అలజడులకు పాల్పడినా... చెడునడతతో ఇతరుల్ని ఇబ్బంది పెట్టినా... నేరాలకు ఒడిగట్టినా ఎవర్నీ ఉపేంక్షించబోమని హెచ్చరించారు.

# 'అనంత' ఆశలపై తుంగభద్ర నీళ్లు



తుంగభద్ర డ్యాంలో గేట్లు ఎత్తివేయడంతో ప్రవహిస్తున్న నీరు

## కొట్టుకుపోయిన డ్యాము 19వ గేటు
## వృథాగా వెళుతున్న నీరు
## హెచ్ఎల్సి ఆయకట్టు రైతుల్లో ఆందోళన



19వ గేటు నుంచి వృథాగా వెళుతున్న నీరు

**తుంగభద్ర రిజర్వాయర్‌కు చెందిన 19వ గేటు శనివారం అర్ధరాత్రి కొట్టుకుపోయింది. దీంతో నీరు వృథాగా నదిలో కలుస్తోంది. డ్యామ్ గేట్ కొట్టుకుపోవడంతో తిరిగి రైతుల్లో గుబులు నెలకొంది. అది కూడా ఈసారి జులై నెలలో మంచి వర్షాలొచ్చి డ్యామ్ పుష్కలంగా నిండటంతో ఇబ్బందులుండవని భావించారు. కాని శనివారం రాత్రి డ్యామ్ గేటు ఒకటి కొట్టుకునిపోవడంతో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆయకట్టు రైతుల్లోనూ జిల్లా దాహార్తికి ఇక్కట్లు తప్పేలా లేవు. ఈ ఏడాది 26 టిఎంసిల నీరు రావచ్చునని అధికారులు ముందుగా అంచనా వేసి అందుకు తగ్గట్టు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో ఇప్పటికే వరి, మిరప పంటలను సాగు చేసియున్నారు. అయితే ఇప్పుడు సీజన్ ముగిసే వరకు నీరొస్తుందా లేదా అన్న సందేహాలు రైతుల్లో నెలకొన్నాయి. ఎందుకంటే ప్రస్తుతం డ్యామ్ నిండుగానున్నా గేటు పోవడంతో నీరు వృథాగా నదిలోపోతోంది.**

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

అనంతపురం జిల్లాలో గడిచిన రెండు సంవత్సరాలుగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న తరుణంలో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువపైనే ఆయకట్టు రైతులు ఆశలు పెట్టుకున్నారు. తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడంతో ఆ ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. నిత్యం దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాకు ఏకైక నిఖర జలాలున్న జలవనరు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ. కర్నాటక రాష్ట్రంలో హొస్పేట్ ప్రాంతంలోనున్న తుంగభద్ర డ్యామ్ నుంచి కుడి ఎగువ ప్రధాన కాలువ అనంతపురం జిల్లాకు వస్తుంది. ఇందులో 105 కిలోమీటర్లు కర్నాటకలో ప్రవహించి అనంతపురం జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాల్ వద్ద ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవహిస్తుంది. ఈ కాలువకు 35.2 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. ఈ నీళ్లు అనంతపురం జిల్లాతోపాటు కర్నూలు, కడప జిల్లాలకు కేటాయింపులు చేయబడి ఉన్నాయి. 2.489 లక్షల ఎకరాలు రిజిస్లర్డ్ ఆయకట్టు ఉంది. ఇందులో ఒక్క అనంతపురం జిల్లాలోనే 1.45 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే పూడిక, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ లేకపోవడం వంటి వాటితో ఏడాదికి సగటున 26 టిఎంసిల నీరు మాత్రమే ఎగువ ప్రధాన కాలువకు వస్తున్నాయి. ఇందులోనూ పది టిఎంసిల వరకు తాగునీటికి వాడుతుండగా, తక్కినవి పంటల సాగుకు వినియోగిస్తున్నారు. ఈ ఏడాది కూడా జూన్‌లో జరిగిన తుంగభద్ర బోర్డు మొదటి సమావేశంలో 26 టిఎంసిల నీరు ఇచ్చే విధంగా నిర్ణయం చేశారు. అందుకు అనుగుణంగా జులై నెలలో మంచి వర్షాలు పడ్డాయి. దీంతో తుంగభద్ర డ్యామ్‌కు ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువగానే నీరు చేరాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 255 టిఎంసిల నీరు డ్యామ్‌కు వచ్చాయి. ఇప్పటికీ 54 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ డ్యామ్‌లోకి వస్తున్నాయి. 33 ప్రధాన గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు. ఇటువంటి సమయంలో 19వ గేటు పడిపోయి నీరు వృథాగా నదిలోకిపోతోంది. దీన్ని సరిచేయాలంటే నీటి మట్టం 1633 అడుగుల నుంచి 1613 అడుగులకు తగ్గిపోవాలి. అంత వరకు ప్రధాన గేటు మరమ్మతుకు నోచుకునే అవకాశం లేదు.





**గతేడాది నీరు లేక అవస్థలు- ఇప్పుడు నీరుండి ఇక్కట్లు**

2023 ఖరీఫ్‌లో వర్షాల్లేకపోవడంతో పంటలు సరిగా పండలేదు. చివరకు తుంగభద్ర డ్యామ్‌కు కూడా 95 టిఎంసిల వరకే నీర్లు రావడంతో ఆయకట్టు రైతులు కూడా నష్టపోయారు. ఈ ఏడాది తుంగభద్ర డ్యామ్ ఎగువ భాగంలో మంచి వర్షాలు పడటంతో నీరు పుష్కలంగా వచ్చింది. ఈసారి ఆయకట్టుకూ ఇబ్బందులుండవని భావించారు. రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో మిరప, వరి పంటలను పెద్దఎత్తున సాగు చేశారు. ఇప్పుడు పంటలు పెట్టుకున్న తరుణంలో డ్యామ్ గేటు పడిపోయి నీరు వృథాగా నదిలోకి పోతోంది. డ్యామ్‌లో నీరంతాపోతే ఆయకట్టుకు నీరొస్తుందా లేదా అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ఎందుకంటే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరు 1600 అడుగుల వరకే అందుతుంది. అంటే 21 టిఎంసిలు డ్యామ్‌లో ఉంటేనే నీరు ఎగువ ప్రధాన కాలువకు అందదు. ఇప్పుడు 1613 అడడుగుల కంటే దిగువకు నీరు వెళితేనే ప్రధాన గేటు మరమ్మతులు చేపట్టేందుకు వీలుంటుంది. అంత వరకు నీరు వృథాగా పోతోంది. మరమ్మతుల తరువాత వర్షాలు రాకపోతే సమస్య తలేత్తే అవకాశాలున్నాయన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

**ప్రత్యక్షంగా పర్యవేక్షణకు జిల్లా నేతలు**

తుంగభద్ర డ్యామ్ గేటు పడిపోయిందన్న విషయం తెలిసిన వెంటనే ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ స్పందించారు. తుంగభద్ర బోర్డు అధికారులతోనూ, జిల్లా హెచ్ఎల్సి అధికారులతో చర్చించారు. సాధ్యమైనంత త్వరగా గేటు ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసకోవాలని సూచించినట్టు ఆయన విడుదల చేసిన విడియోలో తెలిపారు. ఈ ఘటన దురదృష్టకరమని కూడా పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకుంటామని భరోసానిచ్చారు.

**తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోవడం దురదృష్టకరం**

**రాయదుర్గం :** తుంగభద్ర రిజర్వాయర్ 19వ నంబర్ గేటు నదిలో కొట్టుకుపోవడం దురదృష్టకరమని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. ఈమేరకు ఆయన ఆదివారం తుంగభద్ర ప్రాజెక్టు సందర్శించి 19వ గేటు వద్ద నదిలో వెళ్లే నీటి ప్రవాహ ఉధృతిని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శనివారం రాత్రి తుంగభద్ర ప్రాజెక్టు గేటు నదిలో కొట్టుకుపోవడం దురదృష్టకరమన్నారు. ఆంధ్ర, కర్నాటక రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలకు సాగు, తాగునీరు అందించే తుంగభద్ర రిజర్వాయర్‌కు ఈసారి ముందుగానే నీరు వచ్చి జూలై నెలలోనే నిండి ఉండడం ఈ ప్రాంత ప్రజలు, రైతుల్లో ఆనందం నింపిందన్నారు. ఈసారి తాగు, సాగునీటికి ఢోకా ఉండదని అనుకున్న తరుణంలో రిజర్వాయర్ 19వ గేటు కొట్టుకుపోవడం ఆందోళనకరం అన్నారు. ఈ గేటు నుండి 30 వేల క్యూసెక్కుల నీరు నదిలోకి వెళ్తున్నట్లు చెప్పారు. దీని ఒత్తిడి తగ్గించేందుకు అధికారులు ఇతర గేట్ల ద్వారా 90 వేల క్యూసెక్కుల నీటిని నదిలోకి వదిలినట్లు చెప్పారు. కనీసం 64 టీఎంసీల నీరైన రిజర్వాయర్లో నిల్వ ఉండేలా అధికారులు ప్రయత్నిస్తుంటే 50 టీఎంసీలకు నీటి సామర్థ్యం పడిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. వీలైనంత ఎక్కువ నీరు రిజర్వాయర్లో నిలుపుకోవాలని తాము అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. గేటు కొట్టుకుపోవడం మానవతప్పిదమైతే ఇంతకంటే నేరం, ఘోరం మరొకటి ఉండదన్నారు. తుంగభద్ర బోర్డు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉందని, ఈ ఏడాది కూడా రిజర్వాయర్ వార్షిక తనిఖీ జరిగిందని అన్నారు. అన్ని గేట్లు బాగున్నాయని నిపుణులు చెప్పినట్లు తెలిపారు. అయితే గేట్లను లాగే పుల్లింగ్ చైన్ సామర్థ్యం తక్కువగా ఉండటం వల్ల గేటు తెగిపోయి ఉండవచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి రామానాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ టీబీ డ్యాం గేటు పరిరక్షణ విషయమై అవసరమైన చర్యలు తీసుకోమని పురమాయించినట్లు చెప్పారు. తక్షణం ప్రత్యామ్నాయ గేటు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. ఇంజనీరింగ్ నిపుణుడు కన్నయ్య నాయుడు 4 అడుగులకు ఒకటి చొప్పున దశలవారీగా గేటు ఏర్పాటు చేసేందుకు డిజైన్ రూపొందించి ప్రభుత్వానికి బోర్డుకు ఇచ్చినట్లు చెప్పారు. గేటు కొట్టుకుపోయే ఘటనపై విచారణ జరపాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తుంగభద్ర బోర్డు అధికారులను కోరుతున్నామన్నారు. కాగా తుంగభద్ర రిజర్వాయర్ నుండి నదిలోకి నీరు వథాగా పోకుండా అవసరమైన చర్యలను తుంగభద్ర బోర్డు అధికారులు చేపట్టారు గేట్ల వద్ద చైన్లకు అవసరమైన మరమ్మతు పనులు మొదలెట్టారు. రబ్బరు గేట్ల ద్వారా తక్షణం నదిలో వృథాగా వెళ్లే నీటిని నిలువ చేసుకునే ప్రయత్నాన్ని కూడా పరిశీలిస్తున్నారు.



మరమ్మతులు చేపడుతున్న ఇంజినీరింగ్ నిపుణులు



గేటు కొట్టుకుపోవటంతో వృథాగా వెళుతున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ

**డ్యామ్‌ను పరిశీలించిన కర్నాటక డిప్యూటీ సిఎం**

తుంగభద్ర డ్యామును కర్నాటక రాష్ట్ర డిప్యూటీ చీఫ్ మినిస్టర్ డి కె శివకుమార్ ఆదివారం పరిశీలించారు. తుంగభద్ర బోర్డు ప్రత్యామ్నాయ గేటు ఏర్పాటు రిజర్వాయర్‌లో నీటి పరిరక్షణ చర్యల గురించి అధికారులతో చర్చించారు.

**వెంటనే మరమ్మత్తులు చేపట్టాలి : మాజీ ఎమ్మెల్యే విశ్వ**

తెగిపోయిన తుంగభద్ర డ్యామ్ గేటును తక్షణం మరమ్మతులు చేపట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రెండు లక్షల క్యూసెక్కుల వరకు నీరు వృథాగా నదిలోకి పోయిందన్నారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఈ రకమైన ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కర్నాటక ప్రభుత్వంతో చర్చించి రెండు బోర్డు అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు.

### డ్యాం భద్రతపై పటిష్ట చర్యలు తీసుకోవాలి



96 ఏళ్ల డ్యాం చరిత్రలో మొట్టమొదటిసారి గేటు కొట్టుకుపోయింది. డ్యామ్ భద్రతపై కర్నాటక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తక్షణం సమీక్షించి అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలి. అందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవ చూపాలి. కర్నాటకలో కురుస్తున్న అధిక వర్షాల వల్ల డ్యాంకు నీటి ప్రవాహం భారీగా పెరిగింది. ఇప్పటికే ప్రతిరోజు లక్ష క్యూసెక్కుల నీరు కిందకు వదులుతున్నారు. ఈ నీటిని నిలువ చేసుకునే సామర్థ్యం మన రాష్ట్రంలో లేకపోవడంతో అత్యధిక నీరు సముద్రంలో కలిసిపోతోంది. మూడు సంవత్సరాల క్రితం కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు జిల్లాలో వర్షాలు లేక అత్యధిక సాగుభూములు బీడుగా మారుతుంటే మరోవైపు డ్యామ్ లో ఉన్న నీటిని సక్రమంగా ఉపయోగించుకునే పరిస్థితి లేకపోవడానికి మన రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలి. వరద కాలువను నిర్మించాలని తద్వారా డ్యామ్ నుండి వచ్చే అదనపు నీటిని కింది భాగంలో ఉన్న అనంతపురం జిల్లా అభివద్ధికి ఉపయోగించాలని చాలా కాలంగా జిల్లా ప్రజలు కోరుతున్నా ప్రభుత్వాల్లో కనీస చలనం లేదు. కరువుకు పకృతిని కారణంగా చూపే నాయకులు వరదనీరు సముద్రం పాలు కావడానికి బాధ్యత వహించాలి. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వరద కాలువ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు, హెచ్ఎల్సీ ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. తుంగభద్ర డ్యామ్ లో కొట్టుకుపోయిన 19వ గేటును వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి నీరు వధా కాకుండా చూడాలి.

**వి. రాంభూపాల్,**
**సిపిఎం జిల్లా కార్యదర్శి**

### యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి



నీటి తాకిడికి కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం 19 వ గేటును యుద్ధ ప్రాతిపదికన అమర్చి రైతులను ఆదుకోవాలి. ఆంధ్రప్రదేశ్, కర్నాటక ,తెలంగాణ రాష్ట్రాలకు సాగు , తాగునీటికి జీవన ఆధారమైన తుంగభద్ర డాం నీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. తక్కువ నష్టంతో బయటపడేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. పాలకవర్గాలు ఇప్పటికైనా ఈ ఘటనతో కనువిప్పు కలిగి రైతాంగ ప్రయోజనాలకు నష్టం జరగకుండా ప్రాజెక్టుల నిర్వహణకు తగినంత నిధులు కేటాయిస్తూ తగినంత మందిని సిబ్బందిని నిపుణులను ఎప్పటికప్పుడు నియమించాలి.

**జి. ఓబులు,**
**సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు**

## బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళి

ప్రజాశక్తి-రాయదుర్గం



పాత మున్సిపల్ కార్యాలయం వద్ద భట్టాచార్య చిత్రపటానికి నివాళు లర్పిస్తున్న కార్మికులు సిపిఎం నాయకులు

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య మరణం తీరనిలోటు అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున అన్నారు. ఆదివారం రాయదుర్గంలో సిపిఎం నాయకులు, మున్సిపల్ కార్మికులతో కలిసి భట్టాచార్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నాయకులకు బుద్ధదేవ్ భట్టాచార్య జీవితం ఆదర్శం అన్నారు. ఆయన నడిచి అడుగు జాడల్లో ప్రజలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యోగ ఉపాధ్యాయులకు అండగా నిలవాలని కోరారు. ఆయన మరణించే వరకూ వయసు సహకరించకపోయినా సిపిఎం ఏర్పాటు చేసే ప్రతి సభలో పాల్గొని తన విలువైన సందేశాలను వివరించేవారని గుర్తు చేశారు. అంతటి మహోన్నతమైన వ్యక్తి మరణించడం సిపిఎంకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మధు, తిమ్మరాజు హనుమంతు, ఉమేష్, ఓబులేష్ మల్లికార్జున, నాగేంద్ర, అంజి, కృష్ణానాయక్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కాశీపతికి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం



కాశీపతికి నివాళులర్పిస్తున్న అతిథులు

సీనియర్ జర్నలిస్టు వై.కాశీపతి తొమ్మిదవ వర్థంతి సందర్భంగా పలువురు జర్నలిస్టులు నివాళులు అర్పించారు. ఆదివారం సాయంత్రం అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ జర్నలిస్టులు ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాశీపతి సేవలను కొనియాడారు. కాశీపతి జరల్నిస్టుగానే కాకుండా పేద ప్రజల తరుపున పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన సేవలు అజరామరమని కొనియాడారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు ఆజాద్‌కు నాగరాజు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సంస్థ అధ్యక్షులు టివి.రెడ్డి, సీనియర్ జర్నలిస్టు నాగరాజు, పార్థసారథి ,రఫీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల క్షేమమే ఆర్టీసీ లక్ష్యం

### ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్







జిల్లా ప్రజా రవాణ శాఖాధికారి మధుసూదన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఆర్టీసీ ప్రయాణికుల క్షేమమే లక్ష్యంగా ఎపిఎస్ ఆర్టీసీ పని చేస్తోందని ఆసంస్థ జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. దేశంలోనే అతిపెద్ద రవాణా రంగంగా ఆర్టీసీ పేరుపొందింది. మారుతున్న సమాజానికి అనుకూలంగా ఆర్టీసీ సంస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ప్రజలు కూడా ఆర్టీసీ ప్రయాణమే సురక్షితమనే స్థాయికి సంస్థ ఎదిగింది. కానీ ఇంకా మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవటంతో ఇప్పటికీ కిక్కిరిసిన ఆటోలలో, క్యాబ్‌లలో ప్రజలు ప్రయాణిస్తున్నారు. అలాంటి ప్రయాణం ప్రమాదం అని తెలిసినా పలు ప్రాంతాలలో ప్రైవేటు వాహనాల ప్రయాణం తప్పనిసరి అయింది. పలుచోట్ల ఆర్టీసీ సమయపాలన పాటించకపోవడంతో ప్రయాణికులు విసిగిపోయి ఆటోలలో, ఇతర వాహనాలలో ప్రయాణిస్తూనే ఉన్నారు. ప్రయాణికులకు అనుకూలంగా ఆర్టీసీ మరింత సేవా గుణంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు.

**ప్రశ్న : జిల్లాలో ఎన్ని డిపోలు ఉన్నాయి? బస్సుల సంఖ్య ఎంత? ఎంత మంది ఉద్యోగులు ఉన్నారు.?**

**జవాబు :** జిల్లాలో ఆరు డిపోలు ఉన్నాయి. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, మడకశిరలో ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 395 బస్సులు నడుస్తున్నాయి. ఇందులో 110 బస్సులు హైయర్ బస్సులు ఉన్నాయి. 1670 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి డిపోలోను గ్యారేజీ ఏర్పాటు చేయడం జరిగింది. రోజు బస్సుల పర్యవేక్షణ ఉంటుంది. డ్రైవర్ ఇచ్చిన కంప్లైంట్ మేరకు గ్యారేజీలోని మెకానిక్‌లు ఆ బస్సులను మరమ్మతు చేపడుతుంటారు.

**ప్ర : రోజూ ఎన్ని కిలోమీటర్లు బస్సులు నడుస్తాయి? ప్రయాణికులు ఏ మేరకు ప్రయాణిస్తుంటారు.?**

**జ :** రోజూ 1.45 లక్షల కిలోమీటర్లు జిల్లా వ్యాప్తంగా బస్సులు నడుస్తున్నాయి. ఇందులో 1.20 లక్షల మంది రోజు ప్రయాణిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఆర్టీసీ 55 లక్షల రూపాయల ఆదాయంతో ఉంది. గతంలో బస్సుల డీజల్ ఆదా 69 శాతం ఉండగా ఆ సంఖ్య ఇప్పటికి 72 శాతానికి చేరింది. డీజిల్ ఆదా శాతం మరింత పెంచడానికి కృషి చేస్తున్నాము.

**ప్ర : ప్రధాన నగరాలకు పట్టణాలకు కల్పిస్తున్న బస్సు సౌకర్యం గురించి చెప్పండి.?**

**జ :** జిల్లావ్యాప్తంగా అన్ని డిపోల నుంచి ముఖ్యమైన నగరాలకు, పట్టణాలకు బస్సు సౌకర్యం ఉంది. బెంగళూరు, చెన్నై, హైదరాబాదు, విజయవాడ, ఒంగోలు, శ్రీశైలం, తిరుపతి తదితర నగరాలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నాము. ప్రతి పౌర్ణమి రోజుకు ముందుగా అరుణాచలానికి భక్తుల సౌకర్యార్థం బస్సులు నడుపుతున్నాము. ఈ శ్రావణమాసంలో కూడా శ్రీశైలం, తిరుపతి, కసాపురం, మురిడి, నేమకల్లు తదితర పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాము. ప్రయాణికుల కోసం ఫోన్‌పే తో నగదు రహిత ప్రయాణాలకు అనుమతి ఇచ్చాము.

**ప్ర : బస్సులో ఏయే వర్గాలకు రాయితీ ఇస్తున్నారు.?**

**జ :-** సీనియర్ సిటిజన్లకు 25 శాతం రాయితీ కల్పిస్తున్నాము. వికలాంగులకు 50 శాతం రాయితీ కల్పిస్తున్నాము. జిల్లాలో మూడు వేలమంది వికలాంగులు ఈ రాయితీ పొందుతున్నారు. పదవ తరగతి వరకు చదువుకునే అమ్మాయిలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రభుత్వం కల్పించింది.

**ప్ర: జిల్లాలో ఎన్ని బస్సు స్టేషన్లు ఉన్నాయి? కొత్త బస్సులు రానున్నాయా.?**

**జ :** జిల్లా వ్యాప్తంగా ఆరు బస్సు స్టేషన్లు ఉన్నాయి. మండల కేంద్రాల్లో మరో 10 బస్సు స్టేషన్లు ఉన్నాయి. కొత్త బస్సులు మరో 50 రానున్నాయి. ఇందులో 20 సూపర్ లగ్జరీ బస్సులు ఉన్నాయి. అవసరాన్ని బట్టి మారుమూల మండలాలకు బస్సులు నడుపుతున్నాము. అలాగే అంతర్ జిల్లాలకు, అంతర్ రాష్ట్రాలకు బస్సులు నడుపుతున్నాము.

**ప్ర : సమయపాలన పాటించని, నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై తీసుకొనే చర్యలు ఏమిటి? సిబ్బంది కొరత ఉందా.?**

**జ:** సిబ్బంది కొరత అంటూ ఏమీ లేదు. సమయపాలన పాటించని, క్రమశిక్షణ లేకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటున్నాము. అయితే నూటికి ఒకరు లేక ఇద్దరు మాత్రమే నిర్లక్ష్యం చూపుతుండవచ్చు. వారు కూడా మారే అవకాశం ఉంది. నెలలో ఒకసారి ఆ డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహిస్తూనే ఉంటాము. అంతేకాక ఉత్తమ డ్రైవర్లుగా, కండక్టర్లుగా ఎంపికైన వారికి ప్రశంస పత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేస్తూ ప్రోత్సహిస్తున్నాము. ప్రయాణికులే సంస్థకు ఆదాయ వనరు, వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలని శిక్షణలో చెబుతుంటాము. గతంతో పోల్చితే ఇప్పుడు సిబ్బంది పనితీరు గణనీయంగా మారిందని భావిస్తున్నాను.

**ప్ర : ప్రయాణికులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి.?**

**జ :** ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యాలకు చేర్చడమే లక్ష్యంగా ఆర్టీసీ పని చేస్తోంది. కేవలం ప్రజల సౌకర్యార్థం కోసమే లాభేక్ష లేకుండా ఆశించకుండా ప్రభుత్వం సంస్థను నడుపుతోంది. ఆర్టీసీ బస్సు అనేది ప్రయాణికుల ప్రజల ఆస్తి అని భావించాలి. ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణించి క్షేమంగా ఉండాలని కోరుతున్నాం. ఎక్కడైనా ఎవరికైనా ఆయా రూట్లలో ఇబ్బందులు ఏర్పడితే ఆయా డిపో మేనేజర్లకు డయల్ యువర్ మేనేజర్ కార్యక్రమంలో పాల్గొని ఫోన్ ద్వారా సమస్యలను వివరించవచ్చు లేదా నేరుగా ఆయనకు ఫిర్యాదు చేయవచ్చు.

ప్రజాశక్తి
www.prajasakti.com





నూతన కమిటీ సభ్యులతో ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు

# కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

**ప్రజాశక్తి-అనంతపురం అర్బన్**

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఐఎంఎ హాల్‌లో అనంతపురం ఉమ్మడి జిల్లా ఎపి తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్, ఏపీ గవర్నమెంట్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్య, ఆరోగ్య ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. భానుమూర్తి మాట్లాడుతూ జీవో 143ని రద్దు చేయాలని, సీనియర్ ఎఎన్ఎంల రీ డిప్లైమెంట్ రద్దు చేయాలని, ఎఎన్ఎం నుంచి జిఎన్ఎం ఇన్ సర్వీస్ వారిని వెంటనే రిలీవ్ చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు వంద శాతం అమలు, ఫీల్డ్ సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ హాజరు తొలగింపు, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్, 12వ పిఆర్‌సి, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. అనంతరం సత్యసాయి, అనంతపురం జిల్లాలకు వేర్వేరుగా జిల్లా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతపురం జిల్లా ప్రెసిడెంట్‌గా దేవి మల్లికార్జున, వర్కింగ్ పెసిడెంట్‌గా ఆర్.శివప్రసాద్, జనరల్ సెక్రటరీగా పిల్ మురళీకృష్ణ, ట్రెజరర్‌గా పి.శివయ్యను ఎన్నుకున్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలో 'దుర్గం' విద్యార్థిని ప్రతిభ

**ప్రజాశక్తి-రాయదుర్గం**



రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి అందుకుంటున్న ఆర్షిత

కడప జిల్లా ప్రొద్దుటూరులో ఇటీవల జరిగిన సరస్వతి విద్యా మందిరం రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో రాయదుర్గానికి చెందిన సరస్వతి శిశు మందిరం విద్యార్థిని కురువ ఆర్షిత ద్వితీయ స్థానాన్ని సాధించింది. గతనెల ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయిలో హిందూపురంలో ఆవాస విద్యాలయంలో నిర్వహించిన ఆటల పోటీల్లో ఆర్షిత జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో గెలుపొందిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో తమ పాఠశాల విద్యార్థిని ద్వితీయ స్థానములో గెలుపొందినందుకు పాఠశాల కమిటీ అధ్యక్షులు పోరాళు ధనార్దన, ప్రధానాచార్యులు రాజేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచేందుకు కృషి చేసిన ఉపాధ్యాయిని మహాదేవి, చంద్రకళ బృందాన్ని పాఠశాల అధ్యక్షులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి తుకారాం, కోశాధికారి కె.సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-నార్పల**

విద్యార్థుల తల్లిదండ్రులు నిత్యం అప్రమత్తంగా ఉండి తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు.. ఏం చేస్తున్నారనే విషయాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉదయం పాఠశాలకు వెళ్లి, సాయంత్రం పాఠశాల నుంచి వచ్చిన తర్వాత బయట తిరగనీయరాదన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడంతోపాటు వాహనాలను సీజ్ చేస్తామన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు క్రమశిక్షణా రాహిత్యంగా ప్రవర్తించినా, ఆడపిల్లల పట్ల అనుచితంగా వ్యవహరించినా ఆయా పాఠశాలలన ఉంచి టీసీలు ఇచ్చి పంపేలా చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలకు ఫోన్‌లు, పర్సనల్ కంప్యూటర్లు ఇవ్వరాదన్నారు. ఇవ్వాల్సిన పరిస్థితులు వస్తే వాటి వినియోగంపై పూర్తి నిఘా ఉంచాలన్నారు. అలాగే పిల్లలు ధరించే దుస్తులు, హెయిర్ కటింగ్‌పై శ్రద్ధ వహించాలన్నారు. పాశ్చాత్య సంస్కృతులకు దూరంగా ఉంచాలన్నారు. చెడు స్నేహాలు, అలవాట్లపై దృష్టి సారించాలన్నారు. శారీరక శ్రమ అందించే క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు.

**పుట్లూరు :** విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ హేమాద్రి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలు ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చిన తర్వాత ఏం చేఉస్తున్నారో గమణించాలన్నారు. ముఖ్యంగా వాహనాలను ఇవ్వొద్దన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. పిల్లలు తాగుడు, మత్తు మందులు, ఇతరత్రా వాటికి అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు.

# ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి : ఎఒ

**ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం**

మండల పరిధిలోని 14 గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న ఖరీఫ్, వేరుశనగ, ఉద్యానవన రైతులు సాగుచేసిన పంటలను తప్పకుండా ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఎఒ సరిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా వేరుశనగ, మామిడి, కందులు, ఆముదం, టమోటా, మొక్కజొన్న, తదితర పంటలు సాగు చేశారన్నారు. ఇప్పటి వరకూ మండలవ్యాప్తంగా 200 ఎకరాల్లో 8910 మంది రైతులు పంటలు వేశారన్నారు. ఆయా పంటలకు ఈక్రాప్ బుకింగ్ చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హులన్నారు. మండలవ్యాప్తంగా ఈనెల 15వ తేదీలోపు ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఈ-పంట నమోదు కోసం రైతులు తమ ఆధార్, ఫోన్‌నెంబర్, పొలం పాసు పుస్తకం తీసుకుని ఆయా రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల సిబ్బంది కూడా దండోరా వేయించాలన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

**గుత్తి :** మండలంలోని తురకపల్లి గ్రామానికి చెందిన శివశంకర్ (38) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న దీంతో గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు టిడిపి నాయకుడు విజయ భరత్‌రెడ్డి రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.



# ప్రధాని లైవ్ స్ట్రీమింగ్‌ను వీక్షించిన రైతులు

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

భారత వ్యవసాయ పరిశోధన మండలి హెడ్ క్వార్టర్స్ ఢిల్లీలో నిర్వహించిన ప్రధాని నరేంద్రమోదీ సందేశాన్ని మండలంలోని రెడ్డిపల్లిలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం లైవ్ స్ట్రీమింగ్ ద్వారా రైతులకు వినిపించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా బయో ఫోర్టిఫైడ్, క్లయిమేట్ రిసైలైన్ట్ రకాలను దాదాపు 109 పంట రకాలను జాతికి అంకితం చేశారు. ఇందులో ఎన్‌జి.రంగ విశ్వవిద్యాలయం నుంచి రెండు రకాలను జాతీయస్థాయిలో ప్రధాని మోదీ రిలీజ్ చేశారు. పప్పుశనగలో ఎన్‌బిఇజి 1267, పెసరలో ఎల్‌జిజి-610 రకాలను విడుదల చేశారు. ఈ రకం జిల్లాకు చాలా అనుగుణంగా ఉంటుందని తెలిపారు. దేశవ్యాప్తంగా 109 రకాల ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, పూల రకాలను మోదీ భారత జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ కిషోర్, డాక్టర్ మాధవి, సిబ్బంది ముత్యాలరావు, ప్రభు మిత్ర, సాయికుమార్ రెడ్డిపల్లి గ్రామ రైతులు, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

# చరిత్ర సంపదను పరిరక్షించుకోవాలి

## కలెక్టర్ వినోద్‌కుమార్ - పురావస్తు, ప్రదర్శనశాల పరిశీలన

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**



పురావస్తు, ప్రదర్శన శాలలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

చరిత్ర సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ఆదివారం నగరంలోని ఆదిమూర్తి నగర్‌లో ఉన్న రాష్ట్ర పురావస్తు, ప్రదర్శన శాల, పద్మశ్రీ కల్లూరి సుబ్బారావు జిల్లా పురావస్తు ప్రదర్శనశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు (టెక్నికల్) డాక్టర్ బి.రజితకు స్వాగతం పలికి మ్యూజియం ఆవరణంలోని లాన్ ఏరియాలో ఏర్పాటు చేసిన వివిధ కాలాలకు చెందిన రాతి విగ్రహాలను పరిశీలించారు. మొదటి అంతస్తులో చెక్క పీఠాలపై అద్భుతంగా ప్రదర్శించిన చిన్న రాతి విగ్రహాలు, జైన తీర్థంకరుల విగ్రహాలు, ప్రాచీన, మధ్య, నవీన శిలా యాగాలకు చెందిన రాతి పనిముట్లు, 2వ అంతస్తులు నవీన, బృహత్ శిలాయుగాలకు చెందిన కుండలు, టెర్రకోట, సున్నపు బొమ్మలు, పురాతన ఇటుకలు, కాంస్యం ప్రతిమలు, చైనా పింగాణీ పాత్రలు, ఎనామిక్ వేర్, పురాతన నాణేలు, 3వ అంతస్తులో దారు శిల్పాలు, ఆయుధములు, ఆయుధ సామగ్రి, శాసన నకలలు, రాగిపలక శాసనములు, తాటి ఆకుల రాతప్రతులు, పెయింటింగ్స్‌ను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చరిత్ర సంపదను పరిరక్షించుకోవాలన్నారు. ఇందుకోసం జిల్లాలోని ప్రతి గ్రామ, మండల, మున్సిపల్ ఏరియాలు, పొలాలు, నది ప్రదేశాల్లో ఏవైనా చారిత్రత్మక ప్రాధాన్యత కలిగిన రాతి విగ్రహాలు, పనిముట్లు, వస్తువులు ఉన్నట్లు తెలిస్తే జిల్లా పురావస్తు శాఖకు సమాచారం అందజేయాలన్నారు. ఫోన్ నెంబర్ 91541 43137కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు (టెక్నికల్) వి.రజిత, టెక్నికల్ అసిస్టెంట్ మహేంద్ర నాయుడు, టైపిస్ట్ గంగా నరేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# మురుగునీటి సమస్యకు పరిష్కారం

## మేయర్ మహమ్మద్ వసీం

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**



పనులను పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం, కార్పొరేటర్లు

అనంతపురంలోని లలిత కళాపరిషత్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ రహదారుపై చేరుతున్న మురుగునీటి సమస్యకు తాత్కాలికంగా పరిష్కారం చూపామని మహమ్మద్‌వసీం తెలిపారు. ఈమేరకు డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి నగరంలోని మురుగునీటి పైపులైను నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ చేయాల్సి ఉండటంతో మురుగు కాలువ నిర్మాణం పనులు నిలిచిపోయాయన్నారు. మసీదు కాంప్లెక్స్ ముందు ఆక్రమణల తొలగింపు చేపట్టనందున మురుగు కాలువ నిర్మాణం పనులు మధ్యలో ఆగిపోయాయన్నారు. దీంతో సుభాష్ రోడ్డులోకొన్ని రోజుల నుంచి మసీదు కాంప్లెక్స్ వద్ద ప్రధాన రహదారిపై మురుగునీరు చేరి చెరువులా మారిందన్నారు. ఈనేపథ్యంలో తాత్కాలికంగా సమస్య పరిష్కరించడానికి సిమెంట్ పైపులైన్ ఏర్పాటు ద్వారా మురుగునీటిని మళ్లించామన్నారు. నగరంలోని గుల్జార్‌పేట వైపు నుంచి వస్తున్న మురుగునీటిని లలిత కళాపరిషత్ ముందు.. సుభాష్ రోడ్డు నుంచి రాజు రోడ్డులో ఉన్న మురుగు కాలువలోకి మళ్లించి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. రోడ్డు వెడల్పు చేసిన తర్వాత శాశ్వత ప్రాతిపదికన డ్రెయినేజీ నిర్మాణం చేపడతామన్నారు. డ్రెయినేజీ నిర్మాణం జరుగుతున్నందున ఆదివారం ట్రాఫిక్ మళ్లించామన్నారు. సోమవారం కూడా క్యూరింగ్ సాగుతుందన్నారు మంగళవారం నుంచి వాహనాలు వెళ్లడానికి అవకాశం ఉంటుందన్నారు. డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని చెప్పిన వెంటనే కార్పొరేషన్ కమిషనర్ మూర్తి, ఈ ఈ సూర్యానారాయణలు ప్రజలకు ఇబ్బంది లేకుండా రాత్రి వేళలోనే డ్రెయినేజీని నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇఇ సూర్యానారాయణ, కార్పొరేటర్ అబూసాలెహా, తదితరులు పాల్గొన్నారు.

# గోళ్ల పంచాయతీకి జాతీయ స్థాయి గుర్తింపు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం**

**ఢిల్లీ పరేడ్‌కు సర్పంచికు ఆహ్వానం**



గోళ్ల సర్పంచి కవిత బుజ్జన్న

కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామ పంచాయతీకి జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. సర్పంచి కవితా బుజ్జన్న పంచాయతీ అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచినందుకు స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించనున్న వేడులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానం పంపినట్లు ఎంపిడిఒ సొలోమోన్ బాలాజీలు తెలిపారు. సర్పంచి కవిత పంచాయతీ అభివృద్ధి కోసం అహర్నిశలు పని చేయడంతోపాటు సొంత నిధులు వెచ్చించి గోళ్ల సిపాయి, పాత చెరువు గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు అధికారులు గుర్తించి ప్రత్యేక నివేదిక పంపారు. నిధుల కేటాయింపులులో గత రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనప్పటికీ పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు, వీధి దీపాలు, డ్రెయినేజీల పరిశుభ్రత, పారిశుధ్యం పనులు, సురక్షిత మంచినీరు అందజేయడంతోపాటు అనేక సామాజిక కార్యకలాపాల్లో తమవంతు కృషి చేస్తూ జిల్లా స్థాయితోపాటు రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచింది. ఆమె సేవలను గుర్తించిన ఉన్నత స్థాయి అధికారులు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం కింద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఢిల్లీకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈమె ఈనెల 15న ఢిల్లీలోని ఎర్రకోటలో నిర్వహించనున్న పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి కవిత మాట్లాడుతూ తనను ఢిల్లీకి ఆహ్వానించి గోళ్ల గ్రామ పంచాయతీకి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపునిచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ, సిఎం చంద్రబాబు, జిల్లా మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్‌యాదవ్, సవితమ్మ, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సాగు, తాగునీరు అందించాలి

**ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్**

రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పిల్ల కాలువలు ఏర్పాటు చేసి గుంతకల్లు, పామిడి మండలాలకు తాగు, సాగునీరు అందించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ, రైతుసంఘం నాయకులు దోనముక్కల నుంచి పామిడి మండలాలకు ప్రవహించే సహజవంకలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాధారంపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. హంద్రీనీవా నీరు పుష్కలంగా ప్రవహిస్తున్నందున పిల్లకాలల ద్వారా 40 గ్రామాలకు సాగు, తాగునీరు సరఫరా అవకాశం ఉందన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు గతంలో పామిడి మండలానికి వచ్చినప్పుడు పిల్ల కాలువలు తవ్వడానికి రూ.42 కోట్లు ప్రకటించారన్నారు. దీనికితోడు వైసిపి అధికారంలోకి వచ్చాక జగన్ సౌతం రూ.43కోట్లు ప్రకటించారన్నారు. అయినా ఆచరణకు మాత్రం నోచుకోలేదన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి పిల్ల కాలువల తవ్వకానికి నిధులు మంజూరు చేసి సాగు, తాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, కౌన్సిలర్ మహేష్, పట్టణ కార్యదర్శి ఎస్ఎండి.గౌస్, మండల కార్యదర్శి రాయల్ రాము, నాయకులు దేవేంద్ర, కుళ్లాయప్ప, ఎస్ఎఫ్ఐ నియోజకవర్గ కార్యదర్శి వెంకట్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

# ఎస్‌జె కేఫే టేరియా ప్రారంభం

**ప్రజాశక్తి-అనంతపురం**






నూతనంగా నిర్మించిన ఎస్‌జె కేఫేటేరియా, నిర్వాహకులు జాన్

నగరంలోని సాయినగర్ 3వ క్రాస్‌లో నూతనంగా నిర్మించిన ఎస్‌జె కేఫేటేరియాను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌జె కేఫేటేరియా నిర్వాహకులు జాన్ మాట్లాడుతూ తమ వద్ద వివిధ రకాల ఫాస్ట్‌ఫుడ్ లభించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బేకరీ ఐటమ్స్, బ్రేక్‌ఫాస్ట్, ఫ్రైడ్ చికెన్, వెజ్ స్నాక్స్, శాండ్విచ్, మిల్క్ షేక్, ఫ్రూట్ జ్యూస్, ఐస్ క్రీమ్స్, డిసార్ట్స్, వంటి ఐటమ్స్‌తో పాటు పిజ్జా, బర్గర్, బ్రవోనీస్, అన్ని రకాల చికెన్ ఐటమ్స్ లభిస్తాయని వివరించారు. ఈ అవకాశం నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నివాళులర్పిస్తున్న హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు, బి.మోహన్‌నాయక్, విద్యార్థినులు

# వయనాడ్ బాధితులకు నివాళి

**ప్రజాశక్తి-శింగనమల**

హరిత వికలాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు బి.మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కస్తూరిబా పాఠశాల ఆవరణలో వయనాడ్ బాధితులక నివాళులర్పించారు. ఇందులో భాగంగా విద్యార్థినులతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి అంజళి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కొక్క కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో కవితాబాయి, ధనలక్ష్మి, రేష్మ, జానకి, చంద్రకళ, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

# కులాల మధ్య చిచ్చు రేపుతున్న బిజెపి


**ప్రజాశక్తి-గుత్తి**

బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కకూడదని ఉద్దేశంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కులాల మధ్య చిచ్చు రేపుతోందని సామాజిక చైతన్య వేదిక నాయకుడు దాసరి ఆదినారాయణ విమర్శించారు. ఆదివారం మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజలను విభజించి పాలిస్తోందన్నారు. 'ఎస్సీ వర్గీకరణ వద్దు-ఐక్యతే ముద్దు' అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు రామన్న, మాల మహానాడు నాయకులు బండల రామాంజనేయులు, బేల్దారి చంద్ర, నాగప్ప, న్యాయవాది రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

# డీఎస్పీ రవిబాబుకు సన్మానం



డీఎస్పీ రవిబాబును సన్మానిస్తున్న అచ్యుత్‌ప్రసాద్

**కళ్యాణదుర్గం :** డీఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రవిబాబును సిపిఎం జిల్లా నాకులు అచ్చుత్‌ప్రసాద్ ఆదివారం ఘనంగా సత్కరించారు. అంతకుముందు స్థానిక కార్యాలయంలో డీఎస్పీ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా అక్కమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిపిఎం జిల్లా నాయకులు అచ్యుత్‌ప్రసాద్‌తోపాటు అధికారులు, అధికారులు డీఎస్పీను కలిసి బొకేలు అందజేసి సన్మానించారు.

# కార్యకర్త మృతికి నివాళి



బాధితులను పరామర్శిస్తున్న ఎం.వీరాంజనేయులు

**శింగనమల :** మండల కేంద్రంలోని వైసిపి సీనియర్ నాయకులు ఉద్దాల (పెల్లల) నారాయణస్వామి కుమారుడు ఉద్దాల నాగేంద్ర అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ పార్టీ నాయకులు ఎం.వీరాంజనేయులు ఆదివారం నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దుద్దుకుంట భాస్కర్‌రెడ్డి, బెస్త వెంకటనారాయణ, రామాంజనేయులు, అబ్దుల్, లోకనాథ్, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాసుపత్రి వద్ద అన్నదానం



అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

**అనంతపురం :** నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని పెద్దాసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు, కీర్తిశేషులు రబియాబి, భర్త హాజీపీరా వర్ధంతి సందర్భంగా మరిది నబిరసూల్, కుటుంబ సభ్యులు అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నబిరసూల్, మెహరూప్, సుబ్రమణ్యం, ఓబుళపతి, నల్లప్ప, మణిదీప్, లక్ష్మీనారాయణ, దివాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎంఆర్‌పిఎస్ సంబరాలు



కేక్ కోస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు


**అనంతపురం కలెక్టరేట్ :** 30 ఏళ్లుగా మాదిగలు పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇవ్వడం పట్ల ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కమిటీ ఛైర్మన్ బిసిఆర్.దాస్ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్ఆర్.కాలనీ, ధర్మభిక్షం కాలనీల గుండా ర్యాలీ నిర్వహించి భారీ కేక్ కోసం పంచిపెట్టారు. తర్వాత ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు రాము, నాగేంద్ర, నరసింహులు, నల్లప్ప, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# 'ఉపాధ్యాయ సమావేశానికి వ్యతిరేకం'

**అనంతపురం క్రైం :** విజయవాడ ఎన్‌జిఒ భవనంలో ఆదివారం జరిగిన 'ఉపాధ్యాయుల సమస్యలపై చర్చ' అనే కార్యక్రమాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు పోర్టో ఛైర్మన్ ఛైర్మన్ కరణం హరికృష్ణ, జనరల్ సెక్రటరీ అంకాల కొండయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశాన్ని ఏదైనా అధికార పూర్వకమైన స్థలంలో ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని సూచించారు. వైసిపితో అంటకాగిన ఎన్‌జిఒ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ఎపి ఎన్‌జిఒ సంఘం గత ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వానికి అండగా నిలిచి ఉపాధ్యాయ, అధ్యాపక, ఉద్యోగ లోకాన్ని నట్టేట ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో వారి జిల్లా కార్యాలయాల్లో వైసిపి అధికారం కోసం ప్రచారాలు నిర్వహించారని మండిపడ్డారు. అలాంటి మోసపూరిత సంఘం భవనంలో సమావేశం అభ్యంతరకరంగా ఉందన్నారు.

కాగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చించేందుకు ఉపాధ్యాయ సంఘాలతో టిడిపి ఎమ్మెల్సీలు విజయవాడ ఎన్‌జిఒ కార్యాలయంలో వెనుక ఆంతర్యం ఏంటో చెప్పాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్ ప్రశ్నించారు. సమావేశం అధికారికమా.. అనధికారికమా అనే విషయాన్ని ప్రకటించాలన్నారు. సమావేశం నిర్వహించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు లేవా.. అని ప్రశ్నించారు.





తుంగభద్ర ప్రాజెక్టు 19వ గేట్ కొట్టుకుపోవడంతో గేటు వద్ద నీటి ప్రవాహ ఉధృతిని పరిశీలిస్తున్న కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె.శివకుమార్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు.

## నేరాలు ఘోరాలు

# చికిత్స పొందుతూ యువతి మృతి

**పెద్దపప్పూరు :** పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాగరాజు కూతురు భవానీ (18) ఇంటర్ సెకండ్ ఇయర్ పూర్తి చేసి ఎంసెట్ పరీక్ష రాసింది. అయితే ఎంసెట్‌లో ర్యాంకు రాకపోవడంతో మనస్థాపం చెంది శుక్రవారం ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందింది. ఈ మేరకు పెద్దపప్పూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.